మోతీనగర్ కమిటీ హాల్ ప్రహరీ పక్కనే చెట్ల కొమ్మలు



పోస్టాఫీస్ ప్రహరీ సమీపంలో ప్రమాదకరంగా మ్యాన్‌హోలు



ప్రధాన రోడ్డు సమీపంలో చెత్తాచెదారం



మోతీనగర్‌లో.. దండిగా సమస్యలు..!

- ఓవైపు చెత్తాచెదారం, మరోవైపు వాటర్ లీకేజీలు
- రోడ్లన్నీ బురదమయం,
- ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు
- ఇబ్బందుల్లో స్థానికులు
- పట్టించుకోని అధికారులు



మోతీనగర్ ప్రధాన రోడ్డు డివైడర్ పక్కనే ఉన్న మట్టికుప్ప

మోతీనగర్: పూర్వ మోతీనగర్ డివిజన్‌లో సమస్యలు తిష్ట వేశాయి. ఓవైపు చెత్తాచెదారంతో పాటు వాటర్ లీకేజీలతో రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. అంతేగాకుండా రోడ్డు పక్కనే ఉన్న మ్యాన్‌హోళ్లపై మూతలు లేక ప్రమాదకరంగా తయారయ్యాయి. గతంలో మోతీనగర్ డివిజన్ అభివృద్ధిలో నగరంలోనే మొదటి స్థానంలో ఉండేది. ప్రస్తుతం ఎటు చూసినా సమస్యలే కనబడుతున్నాయి. గతంలో సంబంధిత అధికారులు, ఆయా శాఖల సిబ్బందికి సమస్యలపై పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాండురంగానగర్ ప్రధాన రోడ్డు, పోస్ట్ ఆఫీస్ ప్రహరీ సమీపంలోని మ్యాన్‌హోళ్లు, అలాగే మోతీనగర్ విజేత సూపర్ మార్కెట్ సమీపంలోని మ్యాన్‌హోళ్లు ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. మోతీనగర్ ప్రధాన రోడ్డు ఎంసీహెచ్ఎస్ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట కొన్ని నెలలుగా వాటర్ లీకేజ్ కావడంతో రోడ్డుపైనే ప్రవహిస్తోంది. దీంతో పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జలమండలి అధికారులకు సమస్యను విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. అలాగే మోతీనగర్ నుంచి బోరబండకు వెళ్లే ప్రధాన రోడ్డులో డివైడర్‌కిరువైపులా మట్టి కుప్పలు ఉన్నాయి. బబ్బుగూడ ప్రధాన రోడ్డులో డ్రైనేజీ పొంగి ఆ రహదారి అంతా బురదమయంగా తయారవుతోంది. ఇంకోవైపు విద్యుత్ హైటెన్షన్ వైర్లకు చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్నాయని వాటిని తొలగించి రోజుల తరబడి రోడ్డు పక్కన పెడుతున్నారు. మోతీనగర్ నుంచి బబ్బుగూడకి వెళ్లే ప్రధాన రోడ్డులో లీకేజీతో వాల్వ్ నుంచి నీరు బయటకు ప్రవహిస్తోంది. అక్కడనే చెత్తాచెదారం వేయడంతో నీరు చెత్తతో కలిసి మరింత అధ్వానంగా తయారవుతోంది. ఇప్పటికైనా సంబంధిత జీహెచ్ఎంసీ మూసాపేట సర్కిల్ డివిజన్ ఉన్నతాధికారులు స్పందించి మోతీనగర్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీలవాసులు కోరుతున్నారు.



మోతీనగర్ ప్రధాన రోడ్డులో హనుమాన్ ఆలయం సమీపంలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

బాలానగర్: ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆశ వర్కర్లు పిలుపునిచ్చారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటిస్థానంలో 4 లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి అమలుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడాన్ని నిరసిస్తూ కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఆశ వర్కర్లు బాలానగర్‌లో మెడికల్ అధికారులకు **సమ్మె నోటీసుల**ను సోమవారం అందజేశారు. **ఈ సందర్భంగా** వారు మాట్లాడుతూ.. కోడ్స్ **అమలు జరిగితే** కార్మిక సంఘాల ఏర్పాటు కష్ట**తరం అవుతుం**దన్నారు. కార్యక్రమంలో **సబియా, లలిత**, రుక్మిణి, పద్మ, నాజిమా, **స్వర్ణ, ఆఫ్రీన్,** స్వప్న, సరిత, ఉమారాణి, **కల్యాణి, రాణి,** కళావతి, సోమలత తదితరులు **పాల్గొన్నారు.**

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో నాయకులు



ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని ఆయన నివాసంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని శాలువాతో సన్మానించి, అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి తనవంతూ సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో చాపరాల శ్రీనివాస్ దాసు, భాగ్యనగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సైదేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లు చంద్రమౌళి, అంజనా, శ్రీనివాసగౌడ్, సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ రామలింగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీలు అనిల్‌కుమార్, ఈశ్వర్, నిఖిల్, వెంకారెడ్డి, వినయ్, రాజా, ట్రెజరర్ రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ బి.వి. రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బ్రహ్మానంద రెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరీ జనార్దన్, కల్చరల్ సెక్రటరీ అశోక్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యమంటే రోడ్డుపై పడేయడమా..?

ప్రజాపోరు బాట కార్యక్రమంలో ఎంపీ ఈటల ఫైర్

జవహర్‌నగర్: ఇందిరమ్మ రాజ్యమంటే పేదలను రోడ్డుమీద పడేయడమేనా అని, హైడ్రా పేరుతో తెలంగాణలో ప్రభుత్వం అరాచకం సృష్టిస్తున్నారని, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో బీజేపీ జవహర్‌నగర్ ఈస్ట్, వెస్ట్ అధ్యక్షులు కమల్, జ్యోగారావుల ఆధ్వర్యంలో ప్రజాపోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ హాజరై మాట్లాడారు. జవహర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డ్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు రెవెన్యూ అధికారులు పేదల ఇళ్లనే టార్గెట్ చేసుకుని వారిని రోడ్డుమీద పడేయడం సిగ్గు చేటన్నారు. జవహర్‌నగర్‌లో ఎక్కువ శాతం నిరుపేదలు ఉన్నారన్నారు. 30 ఏళ్లకు పైబడి ఏర్పాటు చేసిన కాలనీలలో పాత ఇళ్లను తొలగించి కొత్త ఇళ్లను నిర్మించుకుంటే వారిని రోడ్డున పడేయడం దుర్మార్గమన్నారు. సురారం, అరుంధతీనగర్, హస్మత్‌పేట, జొన్నలబండ బస్తీలలో హైడ్రా వస్తుందని, పేదలు బిక్కుబిక్కుమంటూ కన్నీరుకారుస్తుంటే బుల్డోజర్‌కు అడ్డంగా నిలబడి పేదలకు అండగా ఉండి పోరాడుతున్నామన్నారు. రెవెన్యూ అధికారులకు డబ్బులిస్తే ఒకలాగా.. డబ్బులివ్వకపోతే మరోలాగా వ్యవహరించడం పద్ధతి కాదని ఆరోపించారు. కాప్రా తహసీల్దార్ వ్యవహారంపై మండిపడ్డారు. కూలీపనులు చేసేవారి ఇళ్ల జోలికొస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేదిలేదన్నారు. అనంతరం పలు సమస్యలపై ఎంపీకి వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యేలు బేతి సుభాష్‌రెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర ఓబీసీ అధికార ప్రతినిధి రంగుల శంకర్, మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్‌యాదవ్, అశోక్‌గౌడ్, సంతోష్, రాజు, లక్ష్మిరెడ్డి, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలి

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. ప్రజావాణిలో ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ సమస్యలు, భూ భారతి, మున్సిపాలిటీలు, వివిధ రకాల పెన్షన్లు, ల్యాండ్ అండ్ సర్వే, శిశు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, జిల్లా కో-ఆపరేటివ్‌శాఖ, కరెంట్, ఇతర శాఖలకు సంబంధించి 97 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పెండింగ్ ఉంచొద్దు..

దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్ లేకుండా తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి నిర్వహణ ప్రధాన ఉద్దేశం ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారం చేయడమేనన్నారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులపై రిమార్కులు రాయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ, డీఈఓ విజయకుమారి, డీఎం సివిల్ సప్లై అధికారి సుగుణబాయి, డీఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి, గృహ నిర్మాణశాఖ పీడీ రమణామూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

3 నెలల నుంచి బిల్లులు రాలేదు..

మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకు 3 నెలల నుంచి జీతాలతో సహా వారు పెట్టిన పెట్టుబడి బిల్లులు రాలేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి ఉన్నికృష్ణన్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రతి నెల బిల్లులు ఇవ్వకుండా విద్యార్థులకు భోజనం, గుడ్లు ఎలా పెడతారని ప్రశ్నించారు. భోజన కార్మికులు అప్పులపాలవుతున్నారని, కలెక్టర్ జోక్యం చేసుకుని వారికి రావాల్సిన జీతాలతో సహా 3 నెలలు బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు.

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన

కీసర: యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండి ఉన్నత స్థానాలకు ఎదగాలని కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం అహ్మద్‌గూడ వీఎంఆర్ గ్రామర్ స్కూల్‌లో డ్రగ్స్ నిర్మూలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిండమే లక్ష్యమన్నారు. యువత డ్రగ్స్ భారిన పడటం వల్ల బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు, యువత తమ పరిసరాలు, విద్యాలయాలు, ఇతర చోట్ల వద్ద డ్రగ్స్, గంజాయి వినియోగించినా, విక్రయించినా, తరలించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్సై లక్ష్మణ్, వీఎంఆర్ స్కూల్ కరెస్పాండెంట్ మల్లికార్జున్‌రెడ్డి, హెడ్‌మాస్టర్ సుజాత, నేషనల్ బంజారా మిషన్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణనాయక్, జిల్లా అధ్యక్షులు రవిరాజ్ రాథోడ్, మురళీనాయక్, మల్లేష్, హరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

5 నుంచి తీర్థయాత్రలకు ప్రత్యేక బస్సు

మూసాపేట: ఈనెల 5 నుంచి కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో నుంచి తీర్థయాత్రలకు బస్సు సర్వీసును ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ హరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేపీహెచ్‌బీ కాలనీ నుంచి ఉదయం 8 గంటలకు బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. కొత్తూరులోని పద్మనాభస్వామి, ముచ్చింతల్‌లోని సమతామూర్తి, అమ్మపల్లిలోని సీతారామ స్వామి, శంషాబాద్‌లోని వెండికొండ సిద్ధేశ్వరస్వామి ఆలయాల నుంచి తిరిగి కేపీహెచ్‌బీకి చేరుకుంటుందని తెలిపారు. పెద్దలకు రూ. 500, చిన్నారులకు రూ. 300 టిక్కెట్ ధర ఉంటుందని, స్థానిక భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



తిరుపతి యాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీజేపీ నాయకుడు తిరుపతి యాదవ్ తెలిపారు. డివిజన్ పరిధిలోని మానస సరోవర్ హైట్స్ ఫేస్-2లోని కాలనీవాసులు సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీధి దీపాలు వెలగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ డీఈ స్వప్నతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. అలాగే ఇతర సమస్యలను ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మకరంద్, అరుణ్, సందీప్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని రాజీవ్ గాంధీనగర్ కాలనీకి చెందిన భారతమ్మ (54) అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ తనయుడు, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. డీవీజీ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మజర్, వరలక్ష్మి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 18 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అధ్యక్షతన సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు అందజేశారు. ఇందులో టౌన్‌ప్లానింగ్ 6, శానిటేషన్ 1, ఎలక్ట్రికల్ 2, ఇంజినీరింగ్ 9 మొత్తం 18 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

ఒకరి మృతి..పలువురికి గాయాలు

బాలానగర్: బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. సీఐ నరసింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆస్‌బెస్టాస్ కాలనీకి చెందిన మస్తాన్ (19) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం రాత్రి అతని స్నేహితులైన ప్రతీక్, హుస్సేన్, ముస్తాఫాతో కలిసి కారులో కేపీహెచ్‌బీ కాలనీకి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా అదుపు తప్పి ఉషా ఫ్యాన్ల కంపెనీ దగ్గర విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న మస్తాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్నేహితులు ప్రతీక్, హుస్సేన్,ముస్తాఫాకు గాయాలయ్యాయి. ప్రతీక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బాలానగర్ పోలీసులు తెలిపారు.

సంయుక్తంగా సేవా కార్యక్రమాలు



మోతీనగర్: సేవా భారతీ పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్, రాధిక చారిటబుల్ ట్రస్ట్ రానున్న రోజుల్లో సంయుక్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాయని ఆయా సేవా సంస్థల ప్రతినిధులు తెలిపారు. ప్రముఖ సామాజిక వేత్త డి. రవీంద్రనాథ్ ఠాగూర్ ఆధ్వర్యంలో ప్రముఖ మహిళా పారిశ్రామికవేత్త రాధిక చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు టి. రాధికా రెడ్డి, ఉపాధ్యక్షులు పీఎస్. మూర్తి సభ్యులు శివ పలు సమస్యలపై సోమవారం చర్చించారు. అక్టోబర్ 2న నిర్వహించే సేవా భారతీ చారిటబుల్ ట్రస్ట్ వార్షికోత్సవానికి హాజరు కావాలని కోరుతూ రాధికా రెడ్డిని కోరారు. తాను రావడంతో పాటు రెండు సంస్థలు కలిపి సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. సమావేశంలో కోశాధికారి జి. ఉమామహేశ్వరరావు, టి. నాగేశ్వరరావు, శ్రీసాయి, శ్రీకాంత్ రావు, శేషయ్య చారి, పి. సుధారాణి, శోభారాజన్, లత తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ జారీలో దందా..!

- వ్యాపార సముదాయాలు, లైసెన్స్ జారీలో వ్యత్యాసం
- ఆదాయ వనరుల పెంపునకు అవకాశం
- గండికొడుతున్న పలువురు ఉద్యోగులు
- ఆదాయం కోల్పోతున్న గ్రేటర్ శివారు పురపాలికలు
- కొలతలు లేకుండానే ఒకే తరహా లైసెన్స్
- ఏటా పునరుద్ధరణ తప్పనిసరి
- పట్టించుకోని పురపాలిక యంత్రాంగం



సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు పురపాలక సంఘాల పరిధిలో వివిధ రకాల వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉన్నప్పటికీ.. ఆ స్థాయిలో ట్రేడ్ లైసెన్సులు జారీ కావడం లేదు. దీంతో పురపాలక సంఘాలకు ఏటా ఆదాయానికి భారీగా గండి పడుతోంది. నిబంధనల ప్రకారం ఏ దుకాణం నడపాలన్నా.. వ్యాపారులు మున్సిపాలిటీలకు తగిన రుసుం చెల్లించి ట్రేడ్ లైసెన్స్ పొందాల్సి ఉంటోంది. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని పురపాలక సంఘాల్లో ట్రేడ్ లైసెన్సుల జారీకి పుర యంత్రాంగం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినప్పటికీ, లక్ష్యాన్ని అధిగమించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ఫీజుతో పాటు అదనంగా ..

గ్రేటర్ శివారులో 31 పురపాలక సంఘాల (పెరిగిన మూడింటితో కలిపి) పరిధిలోని దుకాణాలు, హోటళ్లు, ఆసుపత్రులు, ఇతర షాపింగ్ మాల్స్ వంటి అన్ని రకాల దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. వీరంతా ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందుతున్నారు. రహదారులను బట్టి పొడవు, వెడల్పు ఆధారంగా పన్ను వసూలు చేయాల్సి ఉంటోంది. కానీ నగర శివారు పరిధిలో వందలాదిగా మాంసం దుకాణాలు ఉండగా పొడవు, వెడల్పు కొలతలు లేకుండానే రూ. 1000 చొప్పున నిర్ణయించి...అదనంగా ఒక్కో దుకాణానికి రూ.700 వసూలు చేస్తున్నట్లుగా సంబంధిత మాంసం దుకాణదారులు పేర్కొంటున్నారు. ఇతర వ్యాపార, వాణిజ్య సముదాయాల ట్రేడ్ లైసెన్స్‌ల జారీలోనూ ఇదే తరహా పరిస్థితి నెలకొందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పునరుద్ధరించుకోక..

వ్యాపారం నిర్వహించాలంటే ట్రేడ్ లైసెన్స్ పొందాల్సి ఉంటోంది. రుసుం విధింపులో ఇటీవల కొత్త విధానం అమల్లోకి వచ్చింది. చదరపు అడుగుకు రూ.5 చొప్పున నిర్ణయించారు. సాధారణంగా షోరూంలు, మిల్లులు, సరకు నిల్వ చేసే హోల్‌సెల్ వ్యాపార, వాణిజ్య భవన సముదాయాల విస్తీర్ణం ఎక్కువగా ఉంటోంది. కొత్త విధానంలో మదింపు చేస్తే వీరు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించాల్సి ఉంటోంది. కానీ కొందరు రుసుం తక్కువగా ఉన్నప్పుడు లైసెన్స్ పొంది తిరిగి పునరుద్ధరించుకోవడం లేదని తెలుస్తోంది.

ట్రేడ్ లైసెన్సు లేనివెన్నో..

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 4,854 వ్యాపార సముదాయాలకు 2,935 మాత్రమే ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేసినట్లు తెలుస్తోంది. అలాగే పోచారం మున్సిపాలిటీలో 511 సముదాయాలకు 273, బోడుప్పల్‌లో 2035 సముదాయాలకు 455 మాత్రమే ట్రేడ్ లైసెన్సు పొందాయి. జవహర్‌నగర్‌లో 750 కి 282, దుండిగల్‌లో 1248 కి 432, కొంపెల్లిలో 1047 కి 256, నాగారంలో 1211 కి 265 మాత్రమే లైసెన్స్‌లు ఉన్నాయి. ఇదే పరిస్థితి శివారుల్లోని మిగితా పురపాలక సంఘాల్లోనూ నెలకొందన్న ఆరోపణలు ఉన్నాయి. బ్యాంక్‌లో రుణం తీసుకున్న వారు తప్ప మిగతా వ్యాపార సముదాయాలకు సంబంధించిన వారు ట్రేడ్ లైసెన్స్ పొందేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో పురపాలక సంఘాల ఆదాయానికి భారీగా గండి పడుతోంది. రోజురోజుకూ వ్యాపార, వాణిజ్య సంస్థలు పెరిగిపోతున్నా..చాలామంది నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ పొందడం లేదు.

విలీన జీపీల్లోనూ అంతే..

శివారు పురపాలక సంఘాల పరిధిలోని విలీన గ్రామాల్లోనూ పెద్ద సంఖ్యలో దుకాణాలు, వ్యాపార వాణిజ్య సంస్థలు పెరుగుతూనే ఉన్నాయి. గతంలో ఉన్నప్పటికీ రెట్టింపు సంఖ్యలో కొత్తగా దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలు వెలిశాయి. ఇందులో చాలా వాటికి ట్రేడ్ లైసెన్స్ లేకుండానే నిర్వహిస్తున్నారు.